
క్లుప్తంగా

శాకంబరీ దేవిగా అమ్మవారు



కూచిపూడి (మొవ్వ): ఆషాఢ మాసంలో వచ్చే వారాహి నవరాత్రి దినోత్సవ వేడుకల్లో భాగంగా ఐదో రోజైన బుధవారం నాట్యాచార్యుల ఇలవేల్పు అయిన శ్రీ బాలా త్రిపుసుందరి అమ్మవారు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. శ్రీ లలితా త్రిపుర సుందరీ కోలాట, భజన మండలి కూచిపూడి–పెదపూడి ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అర్చకులు పెనుమూడి సతీష్ శర్మ, పెనుమూడి పూర్ణచంద్ర శర్మలు అమ్మవారిని అలంకరించారు. ఈ కార్యక్రమానికి వలివేటి లక్ష్మి, ఏచూరి ఝాన్సీరాణి, ఆలపాటి ప్రమీల రాణి, కారుమూరి ప్రవీణ తదితరులు తమ సహకారాన్ని అందించారు.

జోరుగా సిల్టు తొలగింపు పనులు



గుడివాడ టౌన్: పట్టణంలో సిల్టు తొలగింపు పనులు జోరుగా జరుగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రధాన డ్రెయిన్లలో సిల్టు తొలగిస్తున్నామన్నారు. త్వరలోనే పనులు పూర్తవుతాయని వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలువకుండా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



తోట్లవల్లూరు: మండలంలోని బొడ్డపాడు ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రూ.5 వేల సొంత నిధులతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, డైరీలు పంపిణీకి బుధవారం శ్రీకారం చుట్టారు. సర్పంచ్ శివశంకరరావు, డాక్టర్ వేణుగోపాల్ నోటు పుస్తకాలు, డైరీలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ శివశంకర్, ఉపాధ్యాయులు నాగబాబు, సుమలత, రమాదేవి, సత్యలక్ష్మి,సునీత, దేవి, హేమలత, రిబిక పాల్గొన్నారు.

ఎరువులు కొనుగోలు చేస్తే బిల్లులు ఇవ్వాలి



గుడివాడరూరల్: ఎరువులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రతి రైతుకూ తప్పనిసరిగా షాపుల యజమానులు బిల్లులు ఇవ్వాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఎస్.శ్యామల పేర్కొన్నారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయశాఖ అధికారి బోలెం అనంతలక్ష్మితో కలసి బుధవారం ఆమె పరిశీలించారు. తొలుత ఆయా షాపుల్లోని స్టాక్‌కు సంబంధించి రికార్డులు పరిశీలించారు. కాగా రూ.11,820 విలువ చేసే ఎరువులకు తగిన అనుమతిపత్రాలను అందజేసిన అనంతరం మాత్రమే విక్రయాలు చేయాలని ఓ షాపు యజమానికి సూచించారు. అదేవిధంగా స్టాకు బోర్డు వద్ద ఎరువుల, విత్తనాల స్టాకు ధరల పట్టికను ప్రదర్శించాలని, పూర్తిస్థాయి అనుమతులు ఉన్న ఇన్‌పుట్స్ మాత్రమే రైతులకు విక్రయాలు చేయాలని ఆయా షాపుల యజమానులకు సూచించారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



గుడివాడ టౌన్: బాల్య వివాహాలను రూపుమాపేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు నడుం బిగించాలని సీడీపీఓ ఎ.విజయ ఫ్లారెన్స్ అన్నారు. స్థానిక కైకాల సత్యనారాయణ మున్సిపల్ కళామందిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు బాలల చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల లైంగిక వేధింపులు, అక్రమ రవాణా నిర్మూలన, బాల భిక్షాటన, బాల కార్మికులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వీరిని గుర్తించడంపై కార్యకర్తలు దృష్టిపెట్టాలన్నారు. ప్రత్యేకించి బాలికల వివాహం అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. దీనిపై వంద రోజుల డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 21 నుంచి అక్టోబర్ నాల్గో తేదీ వరకు ఈ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ వీటిపై దృష్టిపెట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ జి.అత్యుష్మ, సోషల్ వర్కర్ కిషోర్, ఎల్.మౌనిక, సూపర్‌వైజర్లు ఎస్.శిరీష, ఎ.తేజస్వి, ఎ. సత్యనారాయణ, బి.శైలజ పాల్గొన్నారు.

అరకొరగా వరినాట్లు

- సకాలంలో అందని సాగునీరు
- వర్షం నీరే రైతులకు ఆధారం
- ప్రభుత్వం నుంచి అందని సహకారం



సాగునీరు రాకపోవడంతో వరినాట్ల కోసం ఎదురు చూస్తున్న పొలం

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో సకాలంలో పంట కాలువలకు సాగునీరు విడుదల చేయకపోవడంతో వర్షం నీటితో రైతన్నలు శ్రమకోర్చి వరినాట్లను ప్రారంభించారు. ప్రతి ఏడాదీ జూలై నాటికి కాలువలకు సాగునీరు విడుదలయ్యేది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు జూలై రెండో వారం వచ్చినా సాగునీరు రాకపోవడంతో వర్షాలు కారణంగా కాలువల్లో చేరిన నీటినే ఇంజిన్ల ద్వారా రైతులు పెట్టుకుని నారుమడులు పోశారు. నారుమడులు అదునుకు రావడంతో రైతులు వరినాట్లు వేసేందుకు డ్రెయిన్లు, కాలువల్లో ఉన్న నీటిని ఇంజిన్ల ద్వారా పొలాలకు పెట్టుకుని వరినాట్లు వేస్తున్నారు. గతంలో కాలువలు, డ్రెయిన్లకు నీరు సకాలంలో రావడంతో రైతులకు అదనపు పెట్టుబడి లేకుండా, ఇంజిన్లతో పని లేకుండా సాగునీటిని పెట్టుకుని వరినాట్లు వేసేవారు. ప్రస్తుతం కాలువలకు నీరు లేకపోవడంతో చేసేది లేక అదనపు పెట్టుబడి పెట్టిమరీ నాట్లు వేసే ప్రక్రియ ప్రారంభించారు. నందివాడ, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని గ్రామాల్లో నాట్లు వేసే ప్రక్రియ సాగుతోంది. రైతులకు సకాలంలో నీరు రాకపోవడంతో కూలీలు, ఇంజిన్ల ఖర్చు ఎక్కువ కావడంతో అప్పులు చేసి మరీ వరిసాగు చేస్తున్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సిబ్బంది సలహాలు, సూచనలతో పాటు ప్రభుత్వం రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయంతో రైతులు నాట్లు సులువుగా వేసేవారు. ప్రస్తుతం పరిస్థితి తలకిందులుగా మారడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి సహకారం అందకపోవడంతో రైతులు నాట్లు వేసే బదులు విత్తనాలు వెదజల్లే ప్రక్రియపై మక్కువ చూపుతున్నారు.

41,550 ఎకరాల్లో వరిసాగు

గుడివాడ నియోజకవర్గంలో మూడు మండలాల్లో కలిపి 41,550 ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌కు వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. సకాలంలో సాగునీరు రాకపోవడం, ప్రభుత్వం నుంచి సహకారం అందకపోవడం, కాలువల్లో ఉన్న అరకొర నీటిని ఉపయోగించుకుని రైతులు సాగుకు సిద్ధమయ్యారు. గత ఏడాది జూలై నాటికి 60 నుంచి 70 శాతం మేర నాట్ల ప్రక్రియ రైతులకు తక్కువ ఖర్చుతో పూర్తయ్యేది. ఈ ఖరీఫ్ సీజన్‌కు ఇప్పటి వరకు 10 శాతం నాట్ల ప్రక్రియ పూర్తి కాలేదు. రైతులు మిగతా నాట్లు వేసేందుకు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సాగునీరు అందించి సకాలంలో నాట్ల ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని, లేకపోతే ఈ ఖరీఫ్ సీజన్‌ను కోల్పోతామని రైతులు వాపోతున్నారు.



వెదజల్లే పద్ధతిలో విత్తనాలు చల్లుతున్న రైతు



లింగవరం వద్ద చంద్రయ్య డ్రైన్ నుంచి ఇంజిన్‌తో నీటిని పొలాలకు పెట్టుకుంటున్న రైతులు

సాగునీరు అందలేదు

జూలై నెల రెండో వారం గడుస్తున్నా ఇప్పటి వరకు సాగునీరు రాలేదు. వర్షాలు కురిసి కాలువల్లో ఉన్న నీటినే సాగుకోసం ఉపయోగిస్తున్నాం. సాగునీటిని పెట్టుకునేందుకు ఇంజిన్లకు ఎక్కువ ఖర్చు అవుతుంది. ప్రభుత్వం ఆదుకోకపోతే ఈ ఖరీఫ్ సీజన్‌లో నాట్లు వేయలేం.

– కైలా అశోక్, కౌలు రైతు

రైతులను ఆదుకోవాలి



ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి. జూలై నెల వస్తున్నా సాగునీరు లేదు. నాట్లు వేసేందుకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. నీరు ఇస్తారో లేదో ఇరిగేషన్ అధికారులు చెప్పడం లేదు. ప్రభుత్వం సకాలంలో సాగునీరు విడుదల చేసి సాగుకు సాయం చేసి ఆదుకోవాలి.

– జి.వెంకటేశ్వరరావు, రైతు, ఎల్ఎన్‌పురం, నందివాడ మండలం

సాగునీరు అందించలేని స్థితిలో ప్రభుత్వం



పెదపారుపూడి: జూలై నెల వచ్చినా రైతులకు సాగునీరు అందించలేని దుస్థితిలో ప్రభుత్వ పనితీరు ఉందని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రైతులు మే నెలలో వరి ఆకుమడులు పోయటంతో నాట్లు వేయటానికి నారు సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం సాగునీరు విడుదల చేయకపోవటంతో వేలాది రుపాయలు ఖర్చు పెట్టి ఆయిల్ ఇంజిన్లు పెట్టి పొలాలకు నీళ్ల పెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జూన్ ఒకటో తేదీ కల్లా సాగునీరు రైతులకు అందించినట్లు తెలిపారు. జూలై నెల వచ్చిన తాగు, సాగుగాని చుక్క నీరు ఇవ్వకపోతే ఎలా అని మండిపడ్డారు.

రేపు హెల్మెట్ వినియోగంపై అవగాహన

గుడివాడ టౌన్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగంపై ఈ నెల 12న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు 11వ అదనపు జిల్లా ఇన్‌చార్జి జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ గుడివాడ చైర్ పర్సన్ ఎస్.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గుడివాడ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు పాల్గొనాలని ఆమె కోరారు.

జీతాల కోసం సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



తోట్లవల్లూరులో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు



పామర్రు ఎంఆర్‌సీ భవనం వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది



పమిడిముక్కల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



పామర్రులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, సీఐటీయూ నాయకులు

తోట్లవల్లూరు: సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జాన్‌మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయం వద్ద భోజన విరామం సమయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు జీతాలు వెంటనే విడుదల చేయాలంటూ ప్లకార్డులు చేతబూని బుధవారం నిరసన తెలియజేశారు. రెండు నెలలుగా జీతాలు లేక జిల్లాలో వందలాది మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని జాన్‌మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు విడుదల చేసి, ఆదుకోవాలని కోరారు. సమగ్ర శిక్ష జిల్లా కమిటీ మాజీ అధ్యక్షుడు పోతురాజు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: మండలంలోని క్లస్టర్ రిజర్వుడ్ మొబైల్ టీచర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఎంఐఎస్, మండల అకౌంటెంట్స్‌గా విధులుగా నిర్వహిస్తున్న వారికి రెండు నెలలుగా జీతాలు ఇవ్వని కారణంగా బుధవారం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ ట్రెజరర్ ఎం.ప్రశాంతి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపామన్నారు. రెండు నెలలుగా సమగ్ర శిక్షలో పని చేస్తున్న సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఉమా, జి శామ్యూల్, పి భవాని, రోజా పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ముందు అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ కనీసవేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమకుమారి, ఉమామహేశ్వరి, భవాని, వెంకటరమణ, కనకదుర్గ, వరలక్ష్మి, స్వరూప పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుడివాడరూరల్: కార్మికుల సమస్యల పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీ పీరెడ్డి డిమాండ్ చేశారు. గుడివాడ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద డిమాండ్స్ డే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజూశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి రేపాని కొండ, నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

పామర్రు: కార్మికుల డిమాండ్స్ డేను పామర్రు లోని నాలుగురోడ్ల కూడలి వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వేము పెదబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన లేబర్ కోర్టులు, నూతన చట్టాలను అమలు చేయరాదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కీం వర్కర్లు, స్వచ్ఛభారత్ కార్మికుల వేతనాలు పెంచాలలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంగాధరప్రసాద్, కొడాలి ఉమారాణి, నాగ సావిత్ర, టీ శ్రీను, సీహెచ్ రమేష్, వెంకటరత్నం, నాగలక్ష్మి, కవిత, అంజమ్మ పాల్గొన్నారు.

పోలుకొండలో పూడికతీత పనులు

సాక్షి స్పందన



పోలుకొండలో పూడికతీత పనులు చేపట్టిన పంచాయతీ అధికారులు

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలోని 'గ్రామాల్లో క్షీణించిన పారిశుద్ధ్యం' అంటూ సాక్షిలో బుధవారం ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. నందివాడ మండలం పోలుకొండ గ్రామంలో సైడ్ డ్రెయిన్ పూడికతీత పనులు చేపట్టారు. మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ వచ్చిన కథనంతో డివిజనల్ పంచాయతీ అధికారి సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి రవికుమార్ స్పందించారు. బుధవారం ఆ గ్రామంలో ఎక్స్‌లేటర్ ద్వారా సైడ్‌డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టారు. సమస్యను పరిష్కరించిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారులకు లైసెన్స్‌లు తప్పనిసరి

గుడివాడరూరల్: వాహనదారులు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గుడివాడ టూటౌన్ ఎస్‌ఐ పి.నాగరాజు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎస్పీఎస్ మున్సిపల్ పాఠశాలలోని విద్యార్థులకు భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించాలని, నాలుగుచక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని కోరారు.

మొవ్వలో..

మొవ్వ: విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని, లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడపరాదని కూచిపూడి ఎస్‌ఐ శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. స్థానిక క్షేత్రయ్య జూనియర్ కళాశాలలో జూనియర్ కళాశాల విద్యార్థులకు మోటార్ వెహికల్ యాక్ట్ పై అవగాహనా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ కేఎస్‌వీ ప్రసాద శాస్త్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. హెల్మెట్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎస్‌ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వీరంకిలాకులో ర్యాలీ నిర్వహించారు.

వెంట్రప్రగడలో..

వెంట్రప్రగడ(పెదపారుపూడి): వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచంలా కాపాడుతుందని ఎస్‌ఐ జి.రాజు అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ సెంటర్‌లో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వలన కలిగే లాభాలపై బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ముదినేపల్లి రూరల్: కౌలు రైతులకు ప్రభుత్వం వెంటనే గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకుడు ఉల్లంకి నాంచారయ్య డిమాండ్ చేశారు. ముదినేపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ పనులు ఇప్పటికే ప్రారంభమైనందున గుర్తింపు కార్డులు లేక కౌలు రైతులు ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. సాగు పనులు ప్రారంభించేందుకు పెట్టుబడులు కావాలని కార్డులు మంజూరు చేస్తే బ్యాంకుల ద్వారా రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం మే నెలలోనే ఈ కార్డులు మంజూరు చేస్తున్నందున బ్యాంకులు సైతం సీజన్‌కు ముందుగానే రుణాలు అందించేవారన్నారు. కార్డుల మంజూరులో జాప్యం జరిగేకొద్దీ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలన్నారు. దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న భూములు సాగు చేసే కౌలు రైతులకు ఎలాంటి ఆంక్షలు విధించకుండా సరళతరంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు.

కొల్లేరులో ఆక్వా రైతులే శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: దేశ ఆక్వా రంగంలో అగ్రగామిగా నిలుస్తోన్న కొల్లేరు ప్రాంతంలో రైతులే శాస్త్రవేత్తల్లా ఆక్వా పరిశ్రమను అభివృద్ధి చేసుకున్నారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో జాతీయ ఆక్వా రైతు దినోత్సవం మత్స్యశాఖ సహాయ సంచాలకులు షేక్ చాన్‌భాషా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా దేశంలో తొలిసారిగా చేపల పెంపకానికి కృషి చేసిన ప్రొఫెసర్ డాక్టర్ హీరాలాల్ చౌదరీ చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కైకలూరులో ఆక్వా సంఘ భవనానికి స్థలం కేటాయిస్తానని చెప్పారు. విజయవాడకు చెందిన రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వాకల్చర్‌కు చెందిన శాస్త్రవేత్తలు అప్పలనాయుడు, బి.సురేష్‌లు తిలాపియా, పండుగప్ప సాగులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.

500 మంది విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు

నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నాయకులు పైడిపాటి శివశంకర్, బోయిడి సురేష్, పేరిచర్ల ప్రసాదరాజు దాతలుగా అందించిన ఉచిత ఆర్టీసీ బస్ పాస్‌లను ఎమ్మెల్యే కామినేని పంపిణీ చేశారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ఎంఈఓ కార్యాలయంలో టూల్ టీచ్ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఎంఈఓలు రామారావు, శ్రీనివాసరావు, సునంద పాల్గొన్నారు.

డీఎన్నార్ పరామర్శ



కైకలూరు: వైఎస్సార్ సీపీ చిన తాడినాడ సర్పంచ్ గండికోట ఏసుబాబు తండ్రి విజయరావు ఇటీవల మృతి చెందారు. గ్రామ శివారు విభరాంపురంలో జ్ఞాపకార్థ కూటమి బుధవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) బరియల్ గ్రౌండ్‌లో విజయరావు సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం కటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ ఏసుబాబు, ముంద్రు చార్లెస్, ద్రోణాద్రి ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

కొండాయపాలెం(పామర్రు): అందరి ప్రేమ అభిమానంతోనే విజయం సాధించానని, ఈ విజయాన్ని ఒక బాధ్యతగా తీసుకుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని పెద మద్దాలి శివారు కొండాయపాలెంలో బుధవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. అన్నదాతలను అన్ని విధాలా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందడుగులు వేసిందన్నారు. అన్నా క్యాంటిన్ల ద్వారా పేదవాడికి అన్నం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

పార్వతీదేవికి ఆషాఢ సారె

కైకలూరు: స్థానిక శ్యామలాంబ ఆలయ ప్రాంగణంలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీదేవికి ఆషాఢ సారెను శ్రీమన్నారాయణ గోష్ఠి సభ్యులు బుధవారం అందించారు. గోష్ఠి అధ్యక్షురాలు చిట్టి హేమలత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హెల్మెట్ తప్పనిసరి

జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్

కైకలూరు: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎం.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మండల న్యాయసాధికారత సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కచ్చితంగా హెల్మెట్ వినియోగించాలన్నారు. మంచి పద్ధతి ఒకరు అవలంబిస్తే మరొకరికి ఆదర్శంగా మారుతుందన్నారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వేంపాటి సాయి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ఇంటి నుంచి బయటకు వెళ్లిన తర్వాత అతను క్షేమంగా ఇంటికి రావాలని కుటుంబ సభ్యులు ఎదురు చూస్తారనే ఆలోచనతో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కెమెరా సృష్టికర్త డాగురేకు ఘన నివాళి

కైకలూరు: కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే వర్ధంతి సందర్భంగా కై కలూరు రైల్వేస్టేషన్ రోడ్‌లో ఆయన విగ్రహానికి నియోజకవర్గ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు పి.సాగర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి ఉపాధి కల్పించిన మహనీయుడు డాగురే అని కొనియాడారు. ఫోటోగ్రాఫర్లు టీఎస్.ఆచారి, కే సుమంత్, జాషువా, సుబ్రహ్మణ్యం, ప్రేమ్‌కిరణ్, స్టూడియో–9 బాలాజీ, నరేంద్ర, సతీష్, సురేష్, శివ, కిరణ్, పండు, నానీ, ప్రేమ్‌కుమార్, శ్యామ్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీలో జీఎస్టీని రద్దు చేయాలి

పామర్రు: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత ఇసుక పాలసీ నుంచి జీఎస్టీని రద్దు చేయాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే డైవై దాసు కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాల్సిన ఈ పాలసీ జీఎస్టీ వలన ప్రజలకు మరింత భారమవుతుందన్నారు. దానిపై సూక్ష్మ పరిశీలన చేసి జీఎస్టీ మినహాయింపునకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. జీఎస్టీ 18 శాతం వసూలు చేయడమే ప్రజలకు మోయలేని భారం అవుతుందన్నారు. దీని నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలని ప్రజల తరపున కోరుతున్నామని ఆయన పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పామర్రు: వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక శృతి హాస్పిటల్ ఆవరణలో ఉదయం 9గంటల నుంచి ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమసాయిరాం బుధవారం తెలిపారు. ఈ శిబిరంలో రక్త పరీక్షలు, మందులను ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు.